

కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38 (సోమవారం)
కనిష్ఠం : 29

షైనింగ్ స్టార్స్ పురస్కారాల ప్రదానోత్సవం



షైనింగ్ స్టార్స్‌కు నగదు ప్రోత్సాహక చెక్కులను విడుదల చేస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కలెక్టర్ తదితరులు...



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్, ఎమ్మెల్యే కొండబాబు



ప్రతిభకు పట్టం!

- విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న కూటమి ప్రభుత్వం
- రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పి.నారాయణ
- కాకినాడలో అట్టహాసంగా షైనింగ్ స్టార్స్ కార్యక్రమం
- 168 మందికి నగదు, పతకం, పురస్కారాలు
- పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కాకినాడ రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యావ్యవస్థ బలోపేతానికి కృషిచేస్తోందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. కాకినాడ టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం కాకినాడ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులకు సంబంధించిన షైనింగ్ స్టార్స్- 2025 కార్యక్రమాన్ని డీఈవో పిల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, జడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడానికి గల కారణాలు, తల్లిదండ్రుల వివరాలు, కళాశాలల్లోని వసతులను వివరించారు. కాకినాడ రూరల్ మండలం స్వామి జూనియర్ కళాశాలకు చెందిన దివ్యాంగురాలు వి.హాసినిశ్రీ, సీహెచ్ శివలక్ష్మిని అభినందించారు. షైనింగ్ స్టార్స్-2025 కింద జిల్లాలో 168 మందిని ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అక్షరాస్యతను మెరుగుపరిచే లక్ష్యంతో విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4,169 మంది విద్యార్థులు ప్రతిభా పురస్కారాలను అందుకుంటున్నారన్నారు. రాష్ట్రచరిత్రలో ఎన్నడూలేనివిధంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో సీఎం చంద్రబాబు కృషితో 750 ఇంజనీరింగ్ కళాశాలలు తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ పురస్కారం అందుకుంటున్న విద్యార్థులంతా భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల మాట్లాడుతూ సామాన్యులకు నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కింద రూ.20 వేలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ వేణుగోపాలరావు, డీఐఈవో ఐ.శారద పాల్గొన్నారు.

వినతుల రికార్డు!




గత వారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద అర్జీదారుల క్యూ (ఫైల్)

గత ఐదేళ్లూ ప్రజలు పరేషన్

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో ప్రజల క్యూ
- 1.27 లక్షల దరఖాస్తులు
- కొత్తకార్డులకు 10,555
- సభ్యులను చేర్చాలంటూ 97,886
- వైసీపీ పాలనలో నో ఛాన్స్
- ప్రస్తుత ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



రేషన్‌కార్డులకి జనం క్యూకడుతున్నారు.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కొత్తరేషన్ కార్డుల మంజూరు, అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలంటూ భారీగా దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎడాపెడా కార్డుల్లో కోత, అడ్డగోలుగా రద్దు.. కొత్తవారిని చేర్చకపోవడంతో వేలాది మంది నరకయాతన పడ్డారు. ప్రభుత్వం మారాక కార్డుదారులపై సీఎం చంద్రబాబు కరుణ చూపారు. ఆరేళ్ల తర్వాత అవకాశం దక్కడంతో జనం నుంచి భారీగా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఏకంగా 1,27,533 మంది అర్జీలు పెట్టుకున్నారు. కొత్తకార్డులకు 10,555 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలంటూ 97,886 మంది విజ్ఞప్తులు చేశారు. అత్యధికంగా ఒక్క తూర్పుగోదావరి నుంచే 43,189 దరఖాస్తులు వచ్చాయి.

అప్పుడంతా అరాచకమే..

వైసీపీ ఐదేళ్ల పాలన..సంక్షేమ పథకాల అమల్లో కోతలే కోతలు అన్నట్టు సాగింది. రకరకాల నిబంధనలతో రేషన్ కార్డులను వేలల్లో ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాలశాఖకు పంపిగుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. ప్రధానంగా 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో రద్దుచేశారు. వాస్తవానికి వీరంతా పొట్టకూటి కోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లినవారే. ప్రజలు అప్పట్లో నిర్వహించిన స్పందనలో కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయా లంటూ అనేకసార్లు భారీగా వినతులు ఇచ్చారు. అయినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. దీంతో అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది. ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను గుర్తుంచుకుని పరిష్కారం కోసం ఆలోచించారు. పౌరసరఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చ జెండా ఊపారు. గత నెల 14 నుంచి సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు అర్జీలు స్వీకరిస్తున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు ఏడు రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఆరేళ్ల తర్వాత అవకాశం రావడంతో ప్రజలు క్యూకడుతున్నారు. ఎక్కడ చూసినా కార్డుల హడావుడే.

అత్యధికం అవే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటివరకు 1,27,533 మంది నుంచి వినతులు వచ్చాయి. అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఎక్కువ. ప్రధానంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా 43,189 అర్జీలు వచ్చాయి. వీటిలో రేషన్ కార్డుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 32,942 మంది మొర పెట్టుకున్నారు. బియ్యం కార్డులు విభజించాలంటూ 3,302 మంది, 3,684 మంది కొత్త కార్డులు కావాలని అర్జీలు అందించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 42,805 మంది వినతులు అందించారు. ఇందులో కొత్తకార్డులు మంజూరు చేయాలని 3,526 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలని 32,852 మంది దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లాలో మొత్తం 41,539 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలని 32,092 మంది, కొత్త కార్డులకు 3,345 మంది దరఖాస్తులు చేశారు. ఇలా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలన చేయనున్నారు. సచివాలయాల స్థాయిలో వీఆర్వోల నుంచి తహశీల్దార్ల వరకు ఆయా అర్జీలను విభాగాల వారీగా పరిశీలించి మార్పులు, చేర్పుల ప్రక్రియ చేపట్టనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు లేదని నిరంతరం కొనసాగిస్తామని కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే మాట చెప్పింది.

జిల్లాల వారీగా దరఖాస్తుల వివరాలిలా..

అర్జీ విభాగం	కాకినాడ	తూగోజి	కోనసీమ
కార్డుల్లో చిరునామా మార్పు	1,447	1501	1387
ఆధార్‌సీడింగ్‌లో తప్పుల దిద్దుబాట్లు	368	387	356
కొత్తగా సభ్యులను చేర్చడం	32,852	32,942	32,092
కొత్తకార్డుల మంజూరు	3,526	3,684	3,345
కార్డుల తొలగింపు	1,294	1,348	1,154
బియ్యంకార్డుల విభజన	3,296	3,302	3,187
రేషన్‌కార్డుల సరెండర్	22	25	18
మొత్తం	42,805	43,189	41,539



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ద్వారా
15 శాతం వృద్ధిరేటు

జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం

కలెక్టరేట్ నుంచి పాల్గొన్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూన్9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ద్వారా 2047 నాటికి 15 శాతం వృద్ధిరేటుతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా సోమవారం 26 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లను, 175 నియోజకవర్గ విజన్ యాక్షన్ యూనిట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖమంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లాలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టరేట్ కోర్టు హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ వంద సంవత్సరాల స్వాతంత్ర వేడుకలు జరుపుకునే 2047నాటికి భారతదేశాన్ని 3వ పెద్ద గ్లోబల్ ఆర్థిక వ్యవస్థగా మలిచేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ విజన్ లక్ష్యాన్ని చేపట్టగా రాష్ట్రాన్ని 42వేల డాలర్ల తలసరి ఆదాయంతో 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ చేపట్టామని తెలిపారు. ఆయా జిల్లాలు, నియోజకవర్గాలలో స్థానిక వనరులు, ప్రధాన రంగాల సమర్థంగా వినియోగించేందుకు ఈ లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా శరవేగంగా సాధించేందుకు జిల్లా, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ విజన్ ప్లాన్ యూనిట్ల లక్ష్యాలను సాకారం చేయడంలో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ యూనిట్ల పనితీరును విశ్లేషించడం జరుగుతుందన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థిక అసమానతలను తొలగించడం, నైపుణ్యాల అభివృద్ధి, మానవ వనరుల శిక్షణ, ఉద్యోగాల కల్పన, అగ్రిటెక్, గ్లోబల్ బ్రాండింగ్, గ్రీన్ ఎకానమీ, ఎనర్జీ ఎఫిషెన్సీ, వాటర్ సెక్యూరిటీ, అంతర్జాతీయ లాజిస్టిక్స్ కల్పన వంటి అంశాలతో విజన్ ప్లాన్ యూనిట్లు పనిచేస్తాయన్నారు. జిల్లా విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్లకు చైర్‌పర్సన్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైస్ చైర్‌పర్సన్‌గా స్థానిక ఎంపీ, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్, సభ్యులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, కన్వీనర్‌గా ముఖ్యప్రణాళికాధికారి వ్యవహరిస్తారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లకు సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే చైర్‌పర్సన్‌గా, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్‌పర్సన్‌గా నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, కన్వీనర్‌గా నియోజకవర్గ ఎంపీడీవోలు వ్యవహరిస్తారు. నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ల కార్యాలయాలు ఏర్పాటుకు ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నిధులు ప్రభుత్వం కల్పిస్తుంది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే వర్మ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, సీపీవో త్రినాథ్, జడ్పీ సీఈవో లక్ష్మణరావులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో బదిలీల జాతర

కాకినాడ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పలు శాఖల్లో బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లా పంచాయతీరాజ్ శాఖలో పెద్దాపురం డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ప్రసాదరావును సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా డ్వామా ఏపీవోగా పనిచేస్తున్న డీఎల్‌డీవో కిషోర్‌కుమార్‌ను సామర్లకోట ఈటీసీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. మత్స్యశాఖలో కాకినాడ ఎస్ఐఎఫ్‌టీ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌గా ఎస్ ఏంజిలి నియమితులయ్యారు. ఇక్కడ ఉన్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌ను విజయవాడ మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా అగ్రికల్చర్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్లు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీల బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా కరప ఎఎంసీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ డి శ్రీనివాసు అనపర్తి ఏఎంసీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

ఆడేసుకుంటున్నారు..

అప్రకటిత విద్యుత్ కోత.. తరచూ విద్యుత్ లోవోల్టేజీతో జనానికి అవస్థలు

మరోవైపు ఉక్కబోత, వడగాలులతో సతమతం


సామర్లకోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో సమస్యలు, అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అష్టకష్టాలు పడుతున్నారు. అసలే మండే ఎండలతో సతమతం అవుతుండగా, దీనికితోడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో మరింత నరకం చూస్తున్నారు. విద్యుత్‌శాఖాధికారులు తమ సహనంతో ఆటాడేసుకుంటున్నారని ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా సామర్లకోట విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా పట్టణంలో గత రెండు రోజులుగా అప్రకటిత విద్యుత్ కోత, విద్యుత్ హెచ్చుతగ్గులతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క ఎండవేడిమి, ఉక్కబోత వాతావరణంతో ప్రజలు తీవ్ర అపసోపాలు పడుతుండగా విద్యుత్ సమస్యలు నిరోధించడంలో పట్టణ విద్యుత్ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. నిబంధనల మేరకు ఏ పట్టణ పరిధిలో విద్యుత్ హెచ్చుతగ్గులు సమస్య ఉండరాదని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సీఎండీ హెచ్చరికలు ఉన్నప్పటికీ వాటిని పెడత్రోవ పెట్టి స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేస్తూ విద్యుత్ వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే విద్యుత్ అంతరాయాలు తరచూ ఏర్పడుతూ రాత్రుళ్లు కంటిమీద కునుకు కరువవుతోందని పలువురు వాపోతున్నారు. ఇటీవల కాలంలో డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాలను ఎంతమాత్రం పెంచకుండా ఇష్టారాజ్యంగా నూతన సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటులేకుండా అపార్ట్‌మెంట్లకు నూతన సర్వీసులు జారీచేయడం వంటి సమస్యలతో ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడ్ పెరిగి తరచూ ఏదొక ఫేజ్‌లు ట్రిప్ అవుతున్నాయని, దీంతో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాల్లో 4 నుంచి 8 గంటల పాటు విద్యుత్ అంతరాయాలు ఏర్పడ్డాయని సోమవారం పలువురు వినియోగదారులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేశారని సమాచారం.

కౌడా వీసీగా జేసీ

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు వీసీగా నగర పాలక సంస్థ కమిషనర్ భావన బాధ్యతలు నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జింబాంబ్వే పర్యటనకు జేసీ రాహుల్‌మీనా

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా విదేశీ పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం సెలవుతో కూడిన అనుమతి మంజూరు చేసింది. ఈనెల 19 నుంచి 26 వరకు జేసీ జింబాంబ్వే దేశానికి కుటుంబంతో వ్యక్తిగత పర్యటనకు వెళ్లడానికి అనుమతి లభించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీవో నంబర్ 1019 జారీ చేసింది.



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

పోలీస్ గ్రీవెన్స్‌కు 59 అర్జీలు

కాకినాడ క్రైం, జూన్9(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ, స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 59 మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహిచిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుచేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తిచేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, అలాగే సబ్ డివిజన్ కార్యాలయాలలోను నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆ ఫిర్యాదులను ఎస్పీ గ్రీవెన్స్‌గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ఎస్‌బి డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

శెహబాస్.. స్టూడెంట్స్

ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు మంచి మార్కులు వస్తే.. పాఠశాలలో తప్ప.. జిల్లా కేంద్రాలకు పిలిచి అభినందించడం ఎప్పుడైనా చూశామా.. ఎక్కడైనా విన్నామా.. సాక్షాత్తూ మంత్రులే వచ్చి వెల్‌డన్ అంటూ దీవించి మీకు మేమున్నాం.. చదువుకోండంటూ మాట ఇచ్చిన ఘటనలు ఉన్నాయా.. గతంలో ఎప్పుడూ లేవు.. తాజాగా కూటమి ప్రభుత్వంలో కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో సుమారు 505 మంది విద్యార్థులను అభినందించారు. ఒక్కొక్కరికీ రూ.20 నగదు.. మెడల్‌తో ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు.. ఇది చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందించారు.



మాది నాణ్యత కలిగిన పాలన.. బ్యాగ్‌లతో మంత్రి నిమ్మల



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో మాధవి



కాకినాడలో విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యే కొండబాబు

శుభకార్యాలకు విరామం

నేటి నుంచి మూఢం, 26 నుంచి ఆషాఢ మాసం

పెద్దాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వివాహ సీజన్ జనవరి 30 నుంచి జూన్ 7 వరకు జోరుగా సాగింది. ఈ నెల 10వ తేదీ నుంచి గురు మౌఢ్యమి, 26న ఆషాఢ మాసం ప్రారంభం కానుండడంతో వివాహాది శుభకార్యాలకు 48 రోజుల పాటు విరామమే.



దీంతో శుభకార్యాల్లో సందడి చేసే డోలు, సన్నాయి మూగబోనున్నాయి. మాంగల్యం తంతునానేన అంటూ పెళ్లి మంత్రాలు చదివే పురోహితులు మౌన వ్రతం చేపట్టాల్సిందే. వంట మేస్త్రీలు, పుష్పాలంకరణ చేసేవాళ్లు, క్యాటరింగ్ సిబ్బంది, లైటింగ్, డెకరేషన్ వారు, కల్యాణ మండపాల యజమానులు విశ్రాంతి తీసుకోవాల్సిందే.

ఈ నెల 10 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గురు మౌఢ్యమి కావడంతో వివాహాది శుభకార్యాలు జరగవని కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన ప్రముఖ జ్యోతిష సిద్ధాంతి చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ జ్యేష్ఠ మాసంలో మూఢమి రాకుంటే మరో 15 రోజులు వివాహాది శుభకార్యాలు జరిగేవన్నారు. ఆ తర్వాత ఆషాఢం శూన్య మాసం కావడంతో శ్రావణమాసంలో వచ్చే నెల 26వ తేదీ నుంచి వివాహాలు, ఇతర శుభకార్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

శుభ ముహూర్తాలు ఇవే...

జూలై: 26, 30, 31

ఆగస్టు: 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17

సెప్టెంబరు: 23, 24, 26, 27, 28

అక్టోబరు: 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31

నవంబరు: 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27



అమలాపురంలోని ఓ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మహిళ

(అమలాపురం టౌన్-ఆంధ్రజ్యోతి)

మా అమ్మాయిని చూసుకోవడానికి అబ్బాయి తరపు వారు వచ్చారు. అన్నీ బాగానే ఉన్నాయి కానీ పిల్ల కాస్త బొద్దుగా ఉందని చెప్పి వెళ్లిపోయారని ఓ తండ్రి ఆవేదన. ఇలా ఎందుకు జరుగుతోందంటూ ఎక్కడ చూసినా ఒకటే చర్చ. దాంతో ఎందరో పెద్దలు మా చిన్నతనంలో... అంటూ సాగదీస్తూ అలనాటి ఆరోగ్య చిట్కాలను చెప్తుతున్నారు.

‘ఫిట్‌నెస్’ మంత్ర

- అందంతో పాటు ఆరోగ్యాన్నిచ్చే వ్యాయామం
- జిమ్‌ల బాట పడుతున్న యువతులు, మహిళలు



రిమ్.. జిమ్ అంటున్న యువతి

నేడు ఇల్లు, వాకిలి నడుం వంచి తుడవాల్సిన పనిలేదు. బట్టలు బండకేసి బాదక్కర్లేదు. మినపప్పు రోలులో వేసి రుబ్బాల్సిన అవసరమూ లేదు. అన్నిటికీ యంత్రాలు వచ్చేశాయి. ఇవన్నీ ధనికుల ఇళ్లకు మాత్రమే పరిమితమనుకుంటే పొరపాటే. మధ్య తరగతి ఇళ్లల్లో కూడా మిషన్లు వచ్చి చేరిపోయాయి. దాంతో ఎందరో మహిళలకు, యువతలకు దైనందిన జీవితంలో కొనసాగుతూ వచ్చిన నిత్య వ్యాయామం తగ్గిపోయింది. దానికి తోడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు కంప్యూటర్లకు మాత్రమే పరిమితమయ్యే పనులు చేసే ఉద్యోగాల సంఖ్యా పెరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల మాదిరిగానే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు కూడా అంతే వేగంగా పెరుగుతూ వచ్చాయి. ఒళ్లు వంచి పనిచేసే ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆధునిక యువతులు, మహిళలు ఎందరో ఊబకాయంతో బాధపడుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితం వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హనుమాన్ వ్యాయామశాలలు మాత్రమే ఉండేవి. అవికూడా 90శాతం మేర పురుషులకే పరిమితమయ్యేవి. కాలక్రమంలో వచ్చిన మార్పులతో అత్యాధునిక జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆయా జిమ్‌ల్లో ప్రత్యేక శిక్షణలు పొంది నాజూకుగా తయారవ్వాలనే వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతూ వస్తోంది.

90 రోజులు క్రమం తప్పకుండా చేయాలి

కంకిపాటి వెంకటేశ్వరరావు, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్, అమలాపురం

ఫిట్‌నెస్ నిలుపుకోవాలంటే ఎటువంటి వ్యాయామమైనా 90 రోజులు క్రమం తప్పకుండా చేయాలి.



వ్యక్తి తీసుకునే ఆహారంలోని క్యాలరీలను ఖర్చు చేయగలిగే దానినే వ్యాయామం అంటారు. ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకోవాలి. కోడిగుడ్డులోని తెల్లటి సొన, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, మిల్క్‌బ్రెడ్, పచ్చరంగు పండ్లు, డ్రైఫ్రూట్స్ బాదం జిగురు (గోండ్ కటీరా) వంటి వాటిని ఆహారంగా తీసుకోవాలి.

అందం చెక్కుచెదరకుండా..

అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం.. అన్నాడో సినీ కవి. వయసులో ఉన్నా, వయసు మీరినా అటువంటి అందాన్ని చెక్కు చెదరకుండా ఉంచుకునేందుకు నేటి తరం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఇందుకోసం మహిళలు, యువతులు పోటీపడుతున్నారు. కొందరు ఆరోగ్యంకోసమైతే, మరికొందరు ఫిట్‌నెస్ కోసం, ఇంకొందరు అందం కోసం. ఎవరి పాలసీ ఏదైనా అందరూ నేడు జిమ్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. కాలం మారిందీ మైనరూ.. ఇక తగ్గాలి మీ జోరు.. అని సినీ కవి అన్నట్టుగా యువతులు యువకులతో పోటీపడుతూ శరీర సౌష్టవాన్ని కాపాడుకుంటున్నారు.



వ్యాయామ సాధనలో....

అన్ని సమస్యలకూ ఒకే రకం వ్యాయామం పనికిరాదు. ఒక్కో సమస్యకు ఒక్కో రకం వ్యాయామం ఎక్కువ ఫలితాన్నిస్తుంది. సమస్యలను బట్టి వ్యాయామాలను ఎంచుకుంటూ ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకోవచ్చునని వ్యాయామశిక్షకులు చెప్తున్నారు. మెరుపుతీగలా ఉండాలని యువతి కోరుకుంటుంది. కానీ ఆధునిక తిండ్లకు అలవాటుపడడంతోపాటికేళ్లకే ఒళ్లు కదిలించలేనంత లావుగా తయారవుతున్నారు. మరికొందరైతే చిరుప్రాయం నుంచే ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. వ్యాయామంతో పాటు అందుకు తగిన ఆహారం తీసుకుంటే ఊబకాయం నుంచి బయటపడవచ్చు. ఇటీవలి కాలంలో మహిళలు, యువతులు స్కిప్పింగ్‌తో శరీర సౌష్టవాన్ని కాపాడుకునే ప్రయత్నం ఇంటినుంచే చేస్తున్నారు. మరికొందరైతే ఇళ్లల్లోని గదులను జిమ్‌లుగా మార్చేసుకుని వ్యాయామాలు చేస్తున్నారు.

మహిళలకు ప్రత్యేకం

ఏ జిమ్‌కు వెళ్లినా మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉంటున్నాయి. మహిళలు, యువతులు ప్రధానంగా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిమ్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలతో వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గడంతో పాటు స్టామినా పెంచుకుంటున్నారు. వ్యాయామాల ద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు తగ్గించుకోవడంతో పాటు సర్వసాధారణంగా మారిన బీపీ, గుండె పల్స్ రేటును నియంత్రించుకునేవిధంగా వివిధ రకాల వ్యాయామాలు చేస్తున్నారు. జిమ్‌లలో అత్యాధునిక పరికరాల ద్వారా వ్యాయామం చేయడం వల్ల శరీరం మృదువుగా మారుతుంది. మహిళలకు ప్రధానంగా స్విస్‌బాల్, ఎలిప్టికల్ ట్రైనర్, ట్రెడ్‌మిల్లర్, అప్ రైట్ బైక్, రెక్యుంబెంట్ బైక్, డబుల్ ట్విస్టర్, హైపర్ ఎక్స్‌టెన్షన్, రబ్బర్ డంబుల్స్, స్టీమ్‌బాత్, బ్లడ్ సర్క్యులేషన్ మిషన్, స్టిక్కింగ్, స్కిప్పింగ్, బాడీ స్ట్రెచింగ్ వంటివి ఎన్నో ఉన్నాయి.



ఒకప్పుడు ఇంటి పనులే మహిళలకు అన్ని రకాల వ్యాయామాలు (ఎక్సర్‌సైజ్‌లు)గా పనిచేసేవి. కాలం మారింది. పనులన్నీ యంత్ర పరికరాలే చేసుకుపోతుండటంతో మహిళలకు వ్యాయామం తప్పనిసరి అయ్యింది. జిమ్‌లవైపు వెళ్లలేని సాధారణ మహిళలు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో నడక వ్యాయామానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక మహిళా ఉద్యోగులెందరో జిమ్‌లలో తమ శరీరానికి సరిపడా వ్యాయామాలను ఎంచుకుని ఓ వైపు ఫిట్‌నెస్‌ను.. మరోవైపు ఆరోగాన్ని కాపాడుకుంటున్నారు. అందుకే ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఫిట్‌నెస్ జిమ్‌లు నేడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయి. లింగ, వయో బేధాలు లేకుండా అందమైన శరీరాకృతిని నిలుపుకునే ప్రయత్నమే అందరిదీ. ఆధునిక సమాజంలో నిత్యం ఒత్తిళ్లకు లోనవుతున్న యువతులు, మహిళలు, విద్యార్థినులు యోగావైపు దృష్టిసారిస్తున్నారు. యోగాలోని పలు ఆసనాలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు.



చిక్కాలంటే... తప్పదు మరి









సదస్సుకు హాజరైన యువకులు, మహిళలు, కోనసీమ స్టార్టప్ సమ్మిట్ బ్రోచరును ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివశంకర్, అధికారులు

టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు

దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి టెన్జింగ్ నారే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని కాకినాడ జిల్లా సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. 2022, 23, 24 సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు https://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిని నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డుకు అర్హులన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం రూ.15లక్షల నగదు అందజేస్తారు.

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి



- ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి
- ‘కోనసీమ స్టార్టప్ సమ్మిట్’లో కార్మిక శాఖ మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం చోడవరం బైపాస్‌లోని విజయ ఫంక్షన్ హాలులో సోమవారం ‘కోనసీమ స్టార్టప్ సమ్మిట్-2025’ పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు, ఉపాధి అవకాశాల పెంపునకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. యువత ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరారు. ఎంఎస్ఎంఈల ద్వారా పరిశ్రమలు స్థాపించాలనే ఆలోచన ఉండి ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ఏడాదికి లక్ష 75వేల మంది పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎటువంటి హామీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు రుణం పొందే అవకాశాన్ని కోనసీమ జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ 2030 నాటికి ప్రతి ఇంటోనూ పారిశ్రామికవేత్త ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. యువత వినూత్నంగా ఆలోచించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ నిర్మూలనకు మంత్రి సుభాష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఫ్లిప్‌కార్ట్ డైరెక్టర్ డిప్పివంకాని మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కోనసీమ అనుకూలమైన ప్రాంతమన్నారు. ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులను ఫ్లిప్‌కార్ట్ ద్వారా అమ్మకాలు చేసుకునేందుకు కృషి చేస్తానన్నారు. కోనసీమ సమ్మిట్‌పై రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి సుభాష్, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆవిష్కరించారు. యువకులు, మహిళల సందేహాలను జిల్లా అధికారులు నివృత్తి చేశారు. సదస్సులో ఆర్డీవో అఖిల, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు ప్రసాద్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజరు మారుతి, సీడాప్ జేడీఎం కిరణ్, పశుసంవర్ధక శాఖ ఏడీ పెద్దిరాజు, లీడ్ బ్యాంకు మేనేజరు కేశవవర్మ, మత్స్య శాఖ ఏడీ కృష్ణ, జనసేన రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి సత్యం, చిక్కాల దొరబాబు, పెసంగి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో

చెన్నై హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మాల కుటుంబసభ్యులతో కలిసి సోమవారం విచ్చేశారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం చేయించి పండితులతో వేదాశీర్వచనం ఇప్పించారు. న్యాయమూర్తి దంపతులకు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందజేశారు.



న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

డీజిల్ మాఫియాపై కదలిక


నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో బంకు లీజుదారుడు వీరబాబు నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

- బయో డీజిల్ బంకులో అధికారుల దాడులు
- ప్రధాన పాత్రధారుడు వైసీపీ నాయకుడే ..
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో వెలుగులోకి ... పురుషోత్తపల్లి బంకులో తనిఖీలు

నిడదవోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న డీజిల్ మాఫియాపై 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్గాల్లో బంకులకు చేర్చి, అక్కడ నుంచి ప్రముఖ కార్పొరేట్ కంపెనీ హెచ్‌పీ లోగోను అడ్డం పెట్టుకుని అనుమతుల్లేని వాహనాల్లో జిల్లాలోని ఇసుక ర్యాంపులు, లారీ స్టాండులో ఉన్న వాహనాలకు డీజిల్‌ను సరఫరా చేసేస్తున్నారు. ఈ మాఫియా వెనుక ముఖ్యపాత్ర, సూత్రదారి వైసీపీ నేత కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒక బయోడీజిల్ బంకును జగ్గంపేట సమీపంలోని ఒక గ్రామానికి చెందిన వైసీపీ నేత వీరబాబు లీజుకు తీసుకుని ఈ డీజిల్ మాఫియాకు తెరలేపాడు. బయో డీజిల్ పేరుతో ఉన్న బంకులో నుంచి పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన డీజిల్, క్రూడ్ ఆయిల్ లాంటివి తెప్పించి ప్రముఖ ఆయిల్ కంపెనీ హెచ్‌పీ పేరుతో స్టిక్కరింగ్ చేయించి సుమారు 3000 లీటర్ల కెపాసిటీ కలిగిన ట్యాంకును బొలేరో వాహనానికి అమర్చి ట్యాంకుకు డిజిటల్ ఎక్విప్‌మెంట్‌తో పాటుగా డీజిల్ కొట్టేందుకు గన్‌ను ఏర్పాటు చేసి ఈ మాఫియా సాగిస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసింది. దీనిపై అధికారులు స్పందించి సోమవారం బంకుపై దాడులు నిర్వహించారు. డివిజినల్ ఏఎస్‌వో నాగాంజనేయులు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బంకు లీజుదారుడు వీరబాబు ఆధ్వర్యంలోనే తాళాలు వేసి వున్న బంకును తెరిపించి రికార్డులను పరిశీలించడంతో పాటు ఆయిల్ శాంపిల్స్‌ను సేకరించారు. దీనిపై పూర్తి నివేదికను జేసీ చినరాముడుకు అందిస్తామని తెలిపారు. ఈ దాడుల్లో రాజానగరం రంగంపేట సివిల్ సప్లయిస్ తహశీల్దార్ బాపిరాజు, పెరవలి సివిల్ సప్లయిస్ తహశీల్దార్ సుధీర్ రెడ్డి, నిడదవోలు సివిల్ సప్లయిస్ తహశీల్దార్ అనిల్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర, వీఆర్ వోలు సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

- కొవ్వూరు డివిజన్ ఏఎస్‌వో నాగాంజనేయులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బయో డీజిల్ బంకులో భూమిపైన ఉన్న ఒక ట్యాంకులో నుంచి భూమిలోపల ఉన్న మరో ట్యాంకు నుంచి ఆయిల్ శాంపిల్స్ సేకరించామని, వీటిని విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి డీజిలో, బయోడీజిలో నిర్ధారణ చేసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే హెచ్‌పీ కంపెనీ పేరుతో అనుమతులు లేకుండా బంకు లీజుదారుడు వీరబాబు తిప్పు తున్న వాహనాన్ని గుర్తించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

131 కేజీల గంజాయి పట్టివేత

- నలుగురి వ్యక్తులు, మూడు కార్లు, రూ. 16,500 నగదు స్వాధీనం
- వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు


గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ హరిబాబు

అన్నవరం, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి అటవీప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 131 కేజీల గంజాయిని సోమవారం అన్నవరం పోలీసులు నెల్లిపూడి శివారు శంఖవరం కత్తిపూడి రోడ్డులో పట్టుకున్నారు. అలాగే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే .. ఏఎస్ఆర్ జిల్లా మాడుగుల మండలానికి చెందిన పొంగి కృష్ణారావు, జగ్గందొర గోపాల్, గొల్లూరి మత్స్యరాజు రెండు కార్లలో గంజాయిని తెస్తూ నెల్లిపూడి సమీపంలో రాజమహేంద్రవరానికి చెందిన కొమలి రామకృష్ణకు చెందిన కారులోకి మార్చుతుండగా పట్టుకున్నారు. గంజాయిని పొంగి కృష్ణారావు వద్ద నుంచి కోమలి రామకృష్ణ తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు హైదరాబాద్, మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. నలుగురితో పాటు మూడు కార్లు, నాలుగు చరవాణీలు, రూ. 16,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ. 6.65 లక్షలు ఉంటుందని డీఎస్పీ వెల్లడించారు. అన్నవరం ఎస్ఐ హరిబాబు, అదనపు ఎస్ఐ ఎల్. ప్రసాద్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఏపీఈఏపీ సెట్‌లో 'ఆదిత్య' విద్యార్థుల జయకేతనం


పాలకుర్తి ఆదిత్య అభిషేక్ (13 ర్యాంక్) | గొల్లపల్లి లోషిణి 72వ ర్యాంక్ | వై.శుభశ్రీవల్లి 91వ ర్యాంక్ | వి.సాయి భవ్య హర్షిణి, 31వ ర్యాంక్ | డి.దేవి సౌమ్యశ్రీ 112వ ర్యాంక్


పి.సాయిశ్రీధర్ 119వ ర్యాంకు

కాకినాడరూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ విడుదల చేసిన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో కాకినాడ 'ఆదిత్య' విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.ఆదిత్య అభిషేక్ (13), జి.లోషిణి (72), వై.శుభశ్రీవల్లీఆత్రేయి (91), జి.శ్రీరామ శశాంక్ (95), వై.వేజిత్ (96) ర్యాంకులు సాధించారు. తమ విద్యార్థులు 121, 136, 156, 169, 170, 172, 177, 198 ర్యాంకులను కూడా కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్ రెడ్డి సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో వి.సాయిభవ్య హర్షిణి (31), డి.దేవి సౌమ్యశ్రీ (112), పి.సాయిశ్రీధర్ (119), సీహెచ్ శ్రీవెంకటశివసాయి అచ్యుత (152) ర్యాంకులు సాధించారు. 100 లోపు ఆరుగురు, 500లోపు 38 మంది, 1000 లోపు 62 మంది ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.

ముగిసిన అప్పనపల్లి బాలబాలాజీ తిరుకల్యాణోత్సవాలు


శ్రీపుష్పయాగంలో భాగంగా దీపాలు వెలిగించిన భక్తులు

మామిడికుదురు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారం నిర్వహించిన శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాస్, చినజీయర్‌స్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీపుష్పయాగంలో భాగంగా అర్చకులు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

నేడు మావోయిస్టుల దేశ వ్యాప్త బంద్

- పలు వాహనాల దారి మళ్లింపు
- పోలీస్ గస్తీ ముమ్మరం


నెల్లిపాక జంక్షన్‌లో వాహనాల దారి మళ్లింపు చేపడుతున్న సీఐ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

ఎటపాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త బంద్‌కు మంగళవారం మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా వాహనాల దారి మళ్లింపు చర్యలను సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. భద్రాచలం నుంచి వయా లక్ష్మీపురం మీదుగా చింతూరు, ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. భద్రాచలం - కూనవరం రోడ్డులో నెల్లి పాక నుంచి జగ్గవరం జంక్షన్ మీదుగా చట్టి వరకు వాహనాలు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ దారిలోనే వాహనాలు రాకపోకలు సాగించాలని సీఐ కన్నప రాజు సూచించారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత భద్రాచలం నుంచి ఘాట్ రోడ్, సీలేరు, కుంట వైపుకు వేళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను భద్రతా కారణాల రీత్యా రద్దు చేసినట్టు తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ అండ్ యాంకిల్ జోనల్ సీఎంఈ


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆర్థో వైద్య నిపుణులు

జీజీహెచ్(కాకినాడ) జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలో ఫుట్ అండ్ యాంకిల్ సమస్యలపై ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అధ్యక్షతన సోమవారం జోనల్ సీఎంఈ జరిగింది. రాజమహేంద్రవరం జీఎస్ఎల్, అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాలల ఎముకల విభాగ పీజీలు, జూనియర్ డాక్టర్‌లు మొత్తంగా 130 మందికి సీఎంఈ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సీఎంఈ ద్వారా ఆధునిక వైద్య పద్ధతులు, సాంకేతిక అంశాలపై వైద్య నిపుణులు వైద్య విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పివి ప్రసన్నకుమార్, జోనల్ సీఎంఈ కోఆర్డినేటర్ డాక్టర్ రమణకుమార్, డాక్టర్లు యెన్నపు నాగేశ్వరరావు, ముఖర్జీ, బీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, పురుషోత్తం, దక్షిణామూర్తి, శ్రీమన్నారాయణ, డాక్టర్ సాయికృష్ణ, అరుణకుమార్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

కరప, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరపకు చెందిన బి.గోవిందు-లీల దంపతులు స్థానికంగా జిలేబీ షాపు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వారి కుమార్తె పాయల్ స్థానిక హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం పదో తరగతి విద్యార్థి ఉష పుట్టినరోజు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన పాయల్ ఎంతకీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఆమె స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సాయంత్రం బాలిక తల్లి కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆటోను బైక్ ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు

వేర్వేరు ప్రమాదాల్లో మరో నలుగురు మృతి

తుని రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆటోను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరుగా యాలపాలైన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామ సమీపంలో జరిగింది. ఎస్ఎస్‌వీ నగరం నుంచి తునికి ద్విచక్రవాహనంపై బయల్దేరిన లోకా రాజబాబు(38), కొల్లు అప్పలకొండ, నప్పి దేవుడు కొలిమేరు వద్ద గూడ్స్ ఆటోను ఢీకొన్నాడు. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా లోకా రాజబాబు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్..

బిక్కవోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కుకు మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం..బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన వేమగిరి రాజేష్(30) పందలపాకలోని మట్టిని బట్టీలకు ట్రాక్టర్‌పై తోలుతున్నాడు. సోమవారం ట్రాక్టర్‌పై మట్టిని తరలిస్తుండగా ఇంజన్ మట్టిలో కూరుకుపోవడంతో ట్రక్కు శీల పిన్ విరిగిపోయింది. దీంతో ఇంజన్‌పై ట్రక్కు పడడంతో రాజేష్ రెండింటికి మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కు మధ్యలో ఇరుక్కుపోయి మృతిచెందిన రాజేష్

కంటైనర్‌కు విద్యుత్ వైర్ తగిలి..

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం ఖండ్రిక వద్ద కంటైనర్ లారీకి 6.2కేవీ లైన్ విద్యుత్ వైర్ తగిలి లారీ డ్రైవర్ మృతి చెందినట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. బీహార్‌కు చెందిన కంటైనర్ లారీ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో ఖండ్రిక వద్ద లారీని పక్కకు తీసి ఆపగా విద్యుత్‌లైన్ లారీకి తగిలి షాక్‌కు గురై డ్రైవర్ మృతిచెందాడు. మృతుడు బీహార్‌కు చెందిన కమల కిషోర్ షాగా గుర్తించారు. మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలివెల వీఆర్వో నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



కంటైనర్‌ను తగిలిన విద్యుత్ వైర్, మృతుడు కమల కిషోర్‌షా

గోదావరిలో జారిపడి ఓ వ్యక్తి..

మామిడికుదురు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామానికి చెందిన మోటిపల్లి స్వామినాయుడు (36) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మరణించాడు. హైదరాబాద్‌లో టైలరింగ్ వృత్తి జీవనం సాగిస్తున్న స్వామినాయుడు శనివారం స్వగ్రామం వచ్చాడని బంధువులు తెలిపారు. కుమార్తెను, కుమారుడిని హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు వచ్చి సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి కనిపించకుండా పోవడంతో గాలింపు చేపట్టగా గోదావరిలో మృతదేహం లభ్యమైంది. దీనిపై నగరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని ఒకరు..

తుని రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వేస్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. మృతుడి ఒంటిపై ఎరుపు, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు నిక్కర్ ఉన్నాయని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే ఎస్ఐని సంప్రదించాలని కోరారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆటో

కోరుకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వైపుగా వెళుతున్న టిప్పర్‌ను బూరుగుపూడిలో డ్రైవర్ పక్కకు ఆపాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో వృద్ధురాలి పరిస్థితి విషయంగా ఉంది. క్షతగాత్రులను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

ఆరుగురికి స్వల్ప గాయాలు

గుంటూరు నుంచి పొల్లూరు జలపాతానికి వస్తుండగా ఘటన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మోతుగూడెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విహారయాత్రకు పొల్లూరు జలపాతానికి వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం జరిగింది. అందరూస్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి ఆరుగురు స్నేహితులు ఓ వ్యాన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతానికి బయల్దేరారు. మోతుగూడెం పరిధిలో సుకుమామిడి-తూలుకొండ రోడ్డులో వ్యాన్ సోమవారం ఉదయం 6గంటలకు అదుపు తప్పి టేకు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికీ చిన్న చిన్న గాయాలయ్యాయి. వారు అటుగా వస్తున్న ఆటో ఎక్కి మోతుగూడెం ఏపీజెన్కో భవ్య హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. ఎస్ఐ సాదిక్‌కు సమాచారం తెలియడంతో వారిని మెరుగైన వైద్యం కోసం చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


చెట్టును ఢీకొన్న వ్యాన్

రాజకీయాలకు జగన్ అనర్హుడు

ఎక్స్ వేదికగా యనమల రామకృష్ణుడు విమర్శలు



తుని రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రాజకీయాలకు అనర్హుడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. అమరావతి ప్రాంత మహిళలను అసభ్యకర పదజాలంతో సాక్షి మీడియా డిబేట్‌లో వైసీపీ నాయకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై యనమల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై యావత్తు మహిళ సంఘాలు ఆందోళన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి పెదవి విప్పకపోవడంతో దీని వెనుక జగన్ పాత్ర ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని యనమల ఎక్స్ అకౌంట్‌లో ట్వీట్ చేశారు.మహిళలపై దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై కానీ, సాక్షి మీడియాపై కానీ జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని ప్రశ్నించిన యనమల కనీసం వ్యవహారాన్ని జగన్ రెడ్డి ఖండించకపోవడం క్షమాపణలు చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాలకు ఏ మాత్రం అర్హుడు కాదని యనమల పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో వైసీపీ నీచ సంస్కృతి బయట పడిందని అన్నారు.

రోజ్‌వుడ్ మంచాలు స్వాధీనం

మారేడుమిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న రెండు రోజ్‌ఉడ్ మంచాలను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సీలేరు నుంచి మోతుగూడెం మీదుగా రాజమండ్రి వెళుతున్న ఆర్టీసీ బస్సులో రెండు విలువైన రోజ్‌వుడ్ మంచాలనుతరలిస్తున్నారని అటవీశాఖాధికారులు అందుకున్న సమాచారంతో మారేడుమిల్లి అటవీశాఖ కార్యాలయం వద్ద బస్సును ఆపి తనిఖీలు నిర్వహించి మంచాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణాపై పూర్తి సమాచారం కోసం విచారణ చేస్తున్నామని దీనిపై అటవీ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో ఆశ్రమానికి వృద్ధుడి అప్పగింత


వృద్ధుడిని ఆశ్రమానికి అప్పగించిన దృశ్యం

సామర్లకోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సుమారు 79 సంవత్సరాల వయసున్న అనాథ వృద్ధుడిని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు గుర్తించి కాకినాడలోని వృద్ధాశ్రమానికి సోమవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు పరిధిలోని ఏలేరు ప్రాంతానికి చెందిన వాకపల్లి చిన్నరాజు కొన్ని రోజులుగా సామర్లకోట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు గుర్తించి చేరదీసి అతడి నుంచి సమాచారం రాబట్టారు. ముందూ వెనుకా ఎవరూ లేరని నిర్ధారించి కాకినాడలోని జనావళి వలంటరీ అర్గనైజేషన్ అనే ఓల్డ్ ఏజ్ హోమ్‌నకు సంరక్షణార్థం అప్పగించారు.అతని సంరక్షణకు అయ్యే ఖర్చును గరగారావు భరించేందుకు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మానవత దృక్పథాన్ని, దాతృత్వాన్ని పలువురు అభినందించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వినతి

గొల్లప్రోలు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దుర్గాడ ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు దిమ్మిలి అప్పారావు (స్టీఫెన్) డిమాండ్ చేశారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనవాణిలో ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. డ్రైన్ లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయి ఇబ్బందిపడుతున్నామన్నారు. కనీసం చెత్త కూడా తీయట్లేదని, దుర్గంధపూరిత వాతావరణం నెలకొందని చెప్పారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

కొనసాగిన మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల ఆందోళన

కాకినాడ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం వారు కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయం వద్ద ర్యాలీగా బయల్దేరి రామారావుపేట మూడు లైట్ల సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్, కలెక్టర్ కార్యాలయం మీదుగా ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీధర్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల శివశంకర్, యకల శ్రీనివాసరావు, కుడుపూడి వీర భద్రరావు, పాలిక సత్యనారాయణ, వీవీ సతీష్, వై.శ్రీనివాస్, సూరిబాబు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

'పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అనుబంధ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేషన్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మే నెలలో జీతాలు సగం మాత్రమే పడ్డాయన్నారు. పారిశుధ్య కార్మికులను చులకనగా చూస్తువారికి మస్తర్లు వేయడంలో సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్ అలసత్వం వహించడం వల్లే ఈ విధంగా జరిగిందని ఆరోపించారు. ముఖ్యంగా 12, 14 సర్కిళ్లలో పనిచేస్తున్న సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. వారి జీతాల నుంచి రికవరీ చేసి కార్మికులకు జీతాలు ఇవ్వాలన్నారు. ధర్నాలో బంగారు రాజేష్, అప్పన్న, నాగేశ్వరరావు, రవీంద్ర, దుర్గ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు

'పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం'

పిఠాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదామని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి విశ్వేశ్వరరెడ్డి, నాయకులు ఓలేటి వెంకటేశ్వరరావు, బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్యనారాయణ, గరగ వీరబాబు, దొడ్డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

సాక్షి మీడియా, జర్నలిస్టులపై ఫిర్యాదు

పిఠాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి మీడియా, అందులోని జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళా నేతలు, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు పట్టణ ఎస్ఐ మణికుమార్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళలు పంపనబోయిన అన్నపూర్ణ, పి.గంగాభవానీ, అరుణకుమారి, సుజాత, కాదాల క్ష్మి, కృపావతి, లక్ష్మి పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిని, ఆ ప్రాంత మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి మీడియా అధినేత్రి భారతిరెడ్డి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మేయర్ సుంకర పావని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.



నిర్మానుష్య ప్రాంతాలను డ్రోన్‌తో పరిశీలిస్తున్న ఎస్ఐ వీరబాబు

డ్రోన్లతో నిఘా

కాకినాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సోమవారం కాకినాడ రూరల్ మండలం మధురానగర్, ఎస్.అచ్చుతాపురం శివార్లలోని నిర్మానుష్య ప్రాంతాలను డ్రోన్‌తో పరిశీలించినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. పేకాట, గంజాయి తాగుటకు, అమ్మకానికి అవకాశమున్న ప్రాంతాలను జల్లెడ పట్టామన్నారు.

'షైనింగ్ స్టార్' అవార్డుల ప్రదానం

సామర్లకోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఒకేషనల్ సీజీటీ గ్రూపులో చిడతా శివలక్ష్మి 962 మార్కులు సాధించింది. కాకినాడలో సోమవారం ఆమెకు మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్ షైనింగ్ స్టార్ అవార్డు అందజేశారు. విద్యార్థిని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఇంటర్మీయట్ విద్య జిల్లా అధికారి ఐ.శారద, సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లీలాశ్రీదేవి అభినందించారు.



శివలక్ష్మికి ప్రతిభా పురస్కారం, నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్

శివలక్ష్మిని చదివించే బాధ్యత నాది
ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని సీహెచ్ శివలక్ష్మి ఎంత వరకు చదివితే అంతవరకు చదివించే బాధ్యత తనదేనని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ దుమ్ములపేటకు చెందిన శివలక్ష్మి సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్‌లో 962 మార్కులు సాధించింది. తనకు పైచదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత లేదని షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె తెలిపింది. దీనికి ఎమ్మెల్యే నానాజీ స్పందించి తాను చదివిస్తానని హామీ ఇచ్చారు.

కాకినాడ టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం 'షైనింగ్ స్టార్స్-2025' అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. పదో తరగతి, ఇంటర్మీడియట్‌ల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రూ.20వేల నగదు, పతకం, ప్రశంసాపత్రం బహూకరించారు.



ఎంఈసీలో 974 మార్కులు సాధించి మంత్రి నారాయణ నుంచి అవార్డు అందుకుంటున్న పిఠాపురానికి చెందిన గొర్రెల మహేశ్వరి



ఇంటర్ సీఈసీలో 939 మార్కులు సాధించి ప్రతిభా అవార్డు అందుకుంటున్న గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వడ్లమూరి జయలక్ష్మి.

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం

కరప, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం నిత్యం యోగా చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. మండలంలోని పాతర్లగడ్డలో సోమవారం ఉదయం అధికారులు నిర్వహించిన యోగాంధ్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యోగాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ట్రైనర్లు యోగా తరగతులు నిర్వహించి పలువురికి శిక్షణ ఇచ్చారు. గురజానపల్లికి చెందిన జనసేన నాయకుడు ముమ్మిడి వెంకటేశ్వరరావుకు రూ.30వేల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, జనసేన నాయకులు బండారు మురళి, తుమ్మలపల్లి మాచరరావు, పబ్బినీడి వెంకటకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు జోకా తాతాజీ, బండారు బాబి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కరప జిల్లా పాతర్లగడ్డలో జరిగిన యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): యోగా చేద్దాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.... నినాదంతో 36వ డివిజన్‌లో కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం యోగాంధ్ర నిర్వహించారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి నల్లారి శ్రీనివాస్, బీజేపీ మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, మహిళా నాయకురాలు నల్లారి తులసి, కూటమి నాయకులు ఆకెళ్ల ప్రసాద్, మండవల్లి సుబ్బారావు, సర్వేశ్, అమలకంటి బాబి, సచివాయల సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా గొల్లప్రోలులో అధికారులు, నాయకులు ర్యాలీ జరిపి మానవహారం నిర్మించారు. నగర పంచాయతీ మేనేజరు నవీన్‌చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రఘుప్రసాద్, మెప్మా టీఎంసీ భారతి, రామకృష్ణ, సంతోష్‌కుమార్, జనసేన నాయకులు బస్సా చిట్టిబాబు, బలిరెడ్డి గంగబాబు, పర్ల రాజా, అన్నందేవర పట్టాబి, గరగ తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకుల ఆధ్వర్యంలో కొండవరంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎండను సైతం లెక్కచేయకుండా కూటమి నాయకులు ప్రధాన వీధుల్లో ప్రదర్శన జరిపి ప్రజలకు యోగా సాధనతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కొండెవరం సర్పంచ్ వేమగిరి చెల్లాయ్యమ్మ, ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, పిఠాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గాది రాజబాబు, టీడీపీ నాయకుడు వేమగిరి రాంబాబు, జనసేన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్

కొత్తపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మెయిన్‌రోడ్డులో నాలుగైదు రోజులుగా మంచి నీటి పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రధాన పైపులైన్ ఏర్పాటుకు రోడ్డును ఒకపక్క తవ్వేశారు. అసలే ఇరుకు రహదారి కావడంతో ఇటీవలి కాలంలో యూనియన్ బ్యాంక్ సమీపంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సిమెంటు రోడ్డను ఒక్కపక్కగా తవ్వడంతో ఈ సమస్య తలెత్తుతోంది. దాంతోపాటు రోడ్డు తవ్వేటప్పుడు దుమ్ము ఇళ్లల్లోకి, దుకాణాల్లోకి వస్తోందని ప్రజలు, వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొన్నాడలో బొండు మట్టి భూముల్లో నిరసన తెలుపుతున్న రైతులు

'బొండుమట్టి తీయించుకోవడం నేరమా'

కొత్తపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమకున్న భూముల్లో బొండు మట్టి మెరకలు తీయించుకుని పొలాన్ని సాగులోకి తీసుకురావడం నేరమా అని మండలంలోని పొన్నాడ గ్రామ రైతులు ప్రశ్నిస్తున్నారు. పొన్నాడ శివారు మల్లివారితోటల్లో అక్రమంగా బొండు మట్టి తవ్వుతున్నారని మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో అడ్డుకోవడం విదితమే. తమకున్న భూముల్లో బొండు మట్టి మెరకలను తొలగించకుంటే సరుగుడు తోటల పెంపకానికి వీలుపడదనే ఉద్దేశ్యంతో మెరకలు తొలగించుకుంటున్నామని ఇందుకు తమకు అనుమతులున్నాయని రైతులు చెప్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో బొండుమట్టి వ్యాపారం చేసిన వర్మకు అప్పుడు లేని ఇబ్బంది ఇప్పుడు ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. అసత్య ఆరోపణలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. పొలాల్లో మెరకలు తొలగించుకునేందుకు అవకాశం కల్పించాలని రైతులు కోరారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, మాజీ ఎమ్మెల్యే వర్మ, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి

విజన్ యాక్షన్ ప్లాన్‌తో సమగ్రాభివృద్ధి

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నేతలు, అధికారులు

పిఠాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విజన్ యాక్షన్ ప్లాన్ ద్వారా నియోజకవర్గాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం సోమవారం సాయంత్రం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పిఠాపురం మునిసిపల్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఉన్న సహజవనరుల వినియోగం, పారిశ్రామికంగా అభివృద్ధి తదితర అంశాలు విజన్ ద్వారా కార్యరూపం దాలుస్తాయని తెలిపారు. పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, మున్సిపల్ కమిషనరు కనకారావు, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాదాలమ్మకు వైభవంగా తిరుప్పావడ సేవ

గొల్లప్రోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు గ్రామ దేవత పాదాలమ్మ వారికి సోమవారం తిరుప్పావడ సేవ వైభవంగా జరిగింది. పులిహోరను రాశిగా పోసి తొమ్మిది రకాల పిండి వంటలను అమ్మవారికి సమర్పించారు. అనంతరం మహాన్న ప్రసాద వితరణ జరిగింది. పాదాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం, జాతర మహోత్సవాలు సోమవారం ముగిశాయి.

ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవం

పిఠాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సోమవారం రాత్రి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ చదరం నరసింగరావు మాట్లాడుతూ శివాజీ కాలంలో మహిళలు హిందూ ధర్మం పట్ల బాధ్యతగా వ్యవహరించారన్నారు. ఆర్ఎస్ఎస్ నేత సత్యరామచంద్రరావు, కొండేపూడి శంకరరావు, మురళీ, కట్టా నాగేశ్వరరావు, సుధాకర్, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

'కాంట్రాక్టు కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో అన్యాయంగా తొలగించిన 5,400 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పోరాటంపై తీవ్ర ఆంక్షలు విధిస్తోందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకుడు వల్లూరి రాజబాబు, ఏఐటీయూసీ నాయకులు రాజేష్, అప్పన్న, నాగేశ్వరరావు, రవీంద్ర, దుర్గ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

పిఠాపురం రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్తలు, అధికారులు కోరారు. పిఠాపురం మండలం రాపర్తి సచివాలయం వద్ద సోమవారం 'వికసిత కృషి సంకల్ప అభియాన్' నిర్వహించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన, ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులు సహా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎలోకే ప్రసాద్, శాస్త్రవేత్తలు డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రవీంద్ర, వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారి అచ్యుతరావు, ఉద్యాన శాఖాధికారి శైలజ, వీఏఏలు, రమ్యశైలి, తులసిరాం పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కరప, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్‌లో భాగంగా వైద్యాధికారి సయ్యద్ ఖతీజా సత్తారి అఫ్రోజ్ ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో కాకినాడ సూర్యగ్లోబల్ హాస్పిటల్ ఏవో కె.తిరుపతిరావు సహకారంతో గర్భిణులకు పండ్లు అందజేశారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది జి.ఏసురత్నం, డీవీవీ సత్యనారాయణ, కె.రాజగోపాలరావు, గ్లోబల్ హాస్పిటల్ మేనేజర్ డి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనును సత్కరిస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు

'మద్యానికి దూరంగా ఉండాలి'

పిఠాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయితేనగర్‌లో మద్యాన్ని వీడి సాధారణ జీవనం సాగిస్తున్న కొంగు శ్రీనును మద్యపాన, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ప్రతినిధులు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యానికి దూరంగా ఉండాలని కోరారు. మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, సహృదయ మిత్ర మండలి అధ్యక్షుడు తోట శ్రీనివాస్, కౌన్సిలర్ పెదపాటి రాజేష్, ప్రతినిధులు కొంగు బాబీ, చంటి, సూర్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ సరుకులు అందించాలి

సామర్లకోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతి ఇంటికీ రేషన్ సరుకులు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కోదండరామపురం, అమ్మాణమ్మ కాలనీ వాసులు రేషన్ కోసం రెండు కిలో మీటర్లు వెళ్లాల్సి ఉందన్నారు. 60 సంవత్సరాలు దాటిన కార్డుదారులకు ఇళ్ల వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆర్థికసాయం

ప్రత్తిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసైనికుడికి ఉత్తరకంచి జనసేన సేవాదళ్ బృందం రూ.15వేలు అందించారు. ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త డి.శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్‌ను ఉత్తరకంచి జనసేన సేవాదళ్ సోషల్ సర్వీస్ బృందం సోమవారం కాకినాడలో పరామర్శించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'పేదల నిర్మాణాలు కూల్చివేత చట్ట విరుద్ధం'



రంపచోడవరంలో న్యూ డెమోక్రసీ నేతల సమావేశం

రంపచోడవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో ఆదివాసీలు, పేదల నిర్మాణాలను రెవెన్యూ అధికారులు చట్ట విరుద్ధంగా కూల్చివేయడాన్ని నిరసిస్తూ సోమవారం రంపచోడవరం ఐటీడీఏ ఎదుట సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కుంజా దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తొలుత రంపచోడవరం మార్క్స్ ఏంగెల్స్ కార్యాలయం నుంచి ఆదివాసీలు, పేదలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నేతలు మాట్లాడారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో పేదల నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేసి, ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వాలే పేదల ఆస్తులను ధ్వంసం చేసి, వారి జీవనాన్ని దెబ్బ తీయడం దారుణమన్నారు. న్యూడెమోక్రసీ కార్యాలయాన్ని కూడా అధికారులు కూల్చేశారని వారు అన్నారు. ఐటీడీఏ ఎదుట ఆందోళన అనంతరం గ్రీవెన్సు సెల్‌కు వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు కత్తుల బాలురెడ్డి, పల్లాల ఆదిలక్ష్మి, అన్నిక పం డమ్మ, పల్లాల అనసూయ, మడకం జోగమ్మ, కొమరం రాములమ్మ, విండెల రామరావు, చెదల మాధవరెడ్డి, ఐ.వి.రమణ, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

యోగా జాతి సంపద: ఎంపీటీసీ రమణ



వై.రామవరం: యోగాంధ్ర ర్యాలీ దృశ్యం

మోతుగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వై.రామవరం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమం సచివాలయ సెక్రటరీ ముర్రం త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ కరకా వెంకటరమణ పాల్గొన్నారు. తొలుత గ్రామసచివాలయ నుంచి ర్యాలీగా నినాదాలతో పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి యోగాపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీటీసీ కరకా వెంకటరమణ మాట్లాడుతూ సచివాలయంలో యోగా ట్రైనర్లతో తరగతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గురుమూర్తి, సచివాలయ సెక్రటరీలు ప్రవీణ్, బేబి, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు విజికీయా, జయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు చోట్ల యోగాంధ్ర ర్యాలీలు

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట గ్రామ వీధుల్లో సోమవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు, కూటమి నాయకులు హాజరై యోగాపై ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల21న విశాఖపట్నంలో నిర్వహించే యోగా దినోత్సవానికి పీఎం మోదీ, సీఎం చంద్రబాబు హాజరవుతారన్నారు. ఈనెల14న అన్ని గ్రామ పంచాయతీల వద్ద డెమో అంతర్జాతీయ దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో సోమవారం ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో పలు కార్యాలయాల నుంచి యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సామాజిక ఆరోగ్యకేంద్రం, ఎంపీడీవో, తహసీల్దార్, ఎం ఈవో కార్యాలయాల సిబ్బంది, మాజీ జడ్పీటీసీ పల్లాల రమణారెడ్డి, ఆయుష్ డాక్టర్ శ్రీహరి, యార్లగడ్డ సర్పంచ్ పల్లాల పద్మావతి, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పది ప్రతిభావంతులకు అవార్డులు





మోతుగూడెం, దేవీపట్నంలలో కలెక్టర్ నుంచి అవార్డులు అందుకుంటున్న విద్యార్థినులు

మోతుగూడెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిభా అవార్డులను పాడేరులో ప్రకటించింది. చింతూరు మండలానికి ఆరు అవార్డులను ప్రకటించారు. మోతుగూడేనికి చెందిన జి.అజయ్, కె.యు.కిరణ్, బి.భాగ్యశ్రీ, ఎ.జాన్వి, చింతూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని వేణుమురుగన్ వర్షిని, మల్లితోట ఆశ్రమ పాఠశాలకు చెందిన గొర్రెల సంతోష్‌లు ప్రతిభ అవార్డులను కలెక్టర్ దినేష్ కుమార్ నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డిశ్వరి, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ చిన్న రామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీటీ వరప్రసాద్ , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం, సర్పంచ్ ఆకేటి సీత పాల్గొన్నారు.

దేవీపట్నం,(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచడంతో షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డులు అందుకున్నారని హెచ్ఎం వీరవిల్లి ముత్యాలరావు తెలిపారు. సోమవారం పాడేరులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నుంచి రూ.20వేలు, మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థులను హెచ్ఎం, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సామిరెడ్డి వీరభద్ర, రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు యోగాంధ్ర టూరిస్ట్ ఐకాన్ డెస్టినేషన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

మారేడుమిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి వన విహారి ప్రాంగణంలో యోగాంధ్ర టూరిస్ట్ ఐకాన్ టెస్టినేషన్ కార్యక్రమం ఈనెల 11న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. సోమవారం మండల స్థాయి కమిటీ సభ్యులతో కలిసి వన విహారి ప్రాంగణాన్ని పరిశీలించి గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈకార్యక్రమానికి మండలంలోని ఉన్న అన్ని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగా ఔత్సాహికులు 3వేల మంది కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని వసతులు కల్పిస్తామని ఎంపీడీవో తెలిపారు.

'ఆదివాసీలకు నష్టం కలగకూడదు'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ వ్యాపారులు

చింతూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆక్రమిత స్థలాల నుంచి దుకాణాలు తొలగించేటప్పుడు ఆదివాసీలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకో వాలని ఆదివాసీ వ్యాపారులు కోరా రు. సోమవారం తహసీల్దార్ చిరం జీవికి వారు వినతిపత్రం అందజే శారు. ఆదివాసీలు ఇపుడిప్పుడే వ్యాపారాలు మొదలు పెట్టారని, ఈనేపథ్యంలో వారి దుకాణాలు తొలగిస్తే వారు ఆర్థికంగా నష్టపో తారన్నారు. ఆదివాసీలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి వ్యాపారాభివృద్ధికి సహ కరించాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మడివిరాజు, కారం సాయిబాబా, జల్లి నరేష్, మిడియం కొండయ్య తదితరులు ఉన్నారు.

'ప్రగతి'లో ట్రైన్ ది ట్రైనర్ ప్రోగ్రామ్

గండేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే, వాద్వాని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ అనే ప్రోగ్రామ్‌లో భాగంగా ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ వెంచర్ క్రియేషన్ అనే అంశంపై ఈనెల 9నుంచి 13వరకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరుగుతుంది. కార్యక్రమం ప్రారంభోత్సవానికి అతిథిగా వైస్‌చాన్సలర్ సిఎస్ఆర్‌కె ప్రసాద్, విశిష్ట అతిథిగా డైరెక్టర్ అకడమిక్‌అండ్‌ప్లానింగ్ జేఎన్‌టియుకే ప్రొఫెసర్ బి.బాలకృష్ణ హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు.కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె ప్రసాద్, కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

యోగాతో ఆరోగ్యం పదిలం

అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యేలు జ్యోతుల, సత్యప్రభ

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఒమ్మంగి గ్రామంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరు యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్ తదితరులతో పాటు, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): యోగాపై అవగాహన కల్పిస్తూ అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై ర్యాలీ ప్రారంభించారు. జగ్గంపేట పంచాయతీ వద్ద నుంచి ఎమ్మెల్యే కార్యాలయం, శ్రీరాంనగర్, నెహ్రూ కాలనీ, జగ్గంపేట మెయిన్ రోడ్డుపై ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి. మోహన రావు, ఎ. భాస్కర రావు తదితరులతో పాటు జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డి ఎం భాస్కరరావు, సీడీపీవో ఎం.పూర్ణిమ, ఏపీఎం ప్రశాంతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యోగాంధ్ర ర్యాలీని నిర్వహించారు. తునిలో మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ ఆఫీస్ నుంచి బాలాజీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, టీడీపీ తుని అధ్యక్షుడు కుసుమంచి శోభారాణి, కౌన్సిలర్లు వాసంశెట్టి శ్రీను, దారా సురేష్ తదితరులతో పాటు, యోగా టీచర్లు పాల్గొన్నారు.

తుని రూరల్‌లో: ఎస్.అన్నవరం వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తుని వరకు ఎంపీడీవో సాయి నవీన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రారంభించిన బైక్ ర్యాలీలో ఎంపీపీ బొప్పన రాము ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అధికారి జి. మరిడయ్య, పలు పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలో పరమేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరంలో యోగా గురువు రాజశేఖర్ నేతృత్వంలో నగర పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పట్టణ పరిధిలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రాజు, జట్ల సోమరాజు, శరణ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. యోగాంధ్రపై రౌతులపూడిలో ర్యాలీ జరపగా, ఎంపీపీ ప్రారంభించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామకృష్ణయ్య, ఎంపీటీసీ బీజారాజు, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరరావు, టీడీపీ యువ నాయకులు ఇటంశెట్టి అశోక్, పైల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో జరిగిన యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో యోగా ర్యాలీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల అన్న క్యాంటీన్‌కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా మహిళా శక్తి సభ్యులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అనంతలక్ష్మి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పోలినాటి ధర్మానంద కుమారి, నకిరెడ్డి సూర్యవతి, గుమ్మల్ల అనంతలక్ష్మి తదితరులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ చెన్నకేశవరావు, హాజరైన ట్రైనీ డీఎస్పీ

భక్తులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు

తుని రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లోవకు వస్తున్న భక్తులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు హెచ్చరించారు. రానున్న ఆషాడమాసాన్ని పురస్కరించుకుని లోవలో రద్దీని దృష్టిలో ఉంచుకుని లోవ కొత్తూరు గ్రామంలో ట్రైనీ డీఎస్పీ సీహెచ్ కుమారితో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెల్మెట్‌ధారణ, సైబర్ నేరాలు అంశాలపై అవగాహన కల్పించారు.



తహశీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి

శంఖవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో అనుమతులు లేకుండా భారీ లోడుతో వెళుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న లారీలపై చర్యలు చేపట్టి వాటిని నియంత్రించాలని జనసేన నేతలు మేకల కృష్ణ, గొర్లి నాగేశ్వరరావు తహశీల్దారుకు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక కార్యాలయాల్లో అధికారులకు ఫిర్యాదులు అందజేసారు. వేగ నియంత్ర లేకుండా పార్టులు ఊడిపోయేంతగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. రవాణా, రోడ్లు భవనాల శాఖలకు రిజిస్టరు పోస్టు ద్వారా ఫిర్యాదులు ఇచ్చామని తెలిపారు. వీటిపై చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలపై నిరసన



కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కోటనందూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. సోమవారం గంటా అమ్మాజీ, బోడపాటి లక్ష్మీ, ముక్కుడుపల్లి లోవమ్మ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయుకులు చిటికెల సత్యనారాయణ, బోడపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు మహిళలు సోమవారం తొండంగి పోలీసులకు ఫిర్యాదు చేసారు. వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ ఎస్సై జగన్మోహన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దూలం మురళి, బంటుపల్లి అన్వేష్, మహిళలు పాల్గొన్నారు.

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): అమరావతిపై విషం చిమ్ముతున్న సాక్షి చానల్‌తో పాటు వైసీపీ నాయకుల కుట్రలను కట్టడి చేయాలని టీడీపీ సీనియర్ నాయకురాలు వి.కొత్తూరు మాజీ సర్పంచ్ తమరాన వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఆమె నేతృత్వంలో మహిళా టీడీపీ నాయకులు తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కృష్ణమాచార్యులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టి.వీరమణి, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేత

తొండంగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను ఏ.కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అందుకున్నారు. సోమవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్ మోహన్ చేతుల మీదుగా 20 వేల నగదు, ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నారు. మండల టాపర్ టి.పావని షణ్ముఖి, వి.దివ్య, ఏ. యశ్వంత్ లు ఈ అవార్డులు పొందినట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీమాణిక్యం తెలిపారు. వీరందరిని డిఈఓ రమేష్ అభినందించారన్నారు. తమ గ్రామం నుంచి మూడు అవార్డులు రావడం పట్ల విద్యాకమిటీ, ఎంఈఓలు షేక్‌బాబ్జి, సుబ్బిరెడ్డిలు అభినందించారు. తుని టాపర్‌గా నిలిచి అవార్డు పొందిన పి.అగ్రహారం గ్రామానికి చెందిన కొల్లా శ్రావణి గ్రామస్తులు అభినందించారు.

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): అల్లిపూడి కస్తూరిబా గాంధీబాలికల విద్యాలయం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన అనిమిరెడ్డి అలేఖ్యకు కలెక్టర్ షాన్‌మోహన్ చేతులమీదుగా మెడల్ రూ 20వేలు నగదు, ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ హెచ్ఈసీ గ్రూప్‌నకు చెందిన ఇంటి నాగలక్ష్మణ్ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా నాగ లక్ష్మణ్ షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్నారు. అతడిని ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో పాటు సహచర విద్యార్థులు సన్మానించి అభినందనలు తెలియజేసారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే షైనింగ్ స్టార్ అవార్డుకు జగ్గంపేట భాష్యం స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినిలు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ తెలియజేశారు. సోమవారం కాకినాడ టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఎంపికైన వారిలో వాసిరెడ్డి హర్షిని, ఒబిన్ని చంద్రిక, అబ్బిరెడ్డి లలిత నాగలక్ష్మి ఉన్నారన్నారు. విద్యార్థులకు 20 వేలు, మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన ప్రతిభా అవార్డుల కార్యక్రమంలో మంత్రి నారాయణ చేతుల మీదుగా తునికి చెందిన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. తునికి చెందిన ఆరుగురు పదో తరగతి విద్యార్థులు రూ.20వేలు నగదు, ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన లక్కోజు సిరి మంత్రి నారాయణ చేతుల మీదుగా రూ.20వేల నగదుతో పాటుగా అవార్డు స్వీకరించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో మండల బీజేపీ నాయకులు

వై.రామవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం చవిటిదిబ్బలు గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కడబాల ఆదివిష్ణు ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కండ ప్రముఖ బచ్చల సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు పల్లాల స్వామిరెడ్డి, జనరల్ సెక్రటరీ వెదుళ్ల సత్యవతి, సమర సత సేవా ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారక్ మడకం వెంకటేశ్వర్లు, కురుసం గంగరాజు, పల్లాల పండురెడ్డి, వీకా చిన్నబ్బాయి, వలాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

జగన్ బ్యాచ్‌తో మహిళలకు అగౌరవం



మాజీ జడ్పీటీసీ ఎడవల్లి కన్యకా పరమేశ్వరి ఆధ్వర్యంలో టీడీపీ మహిళా కార్యకర్తల నిరసన

కూనవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి):జగన్మోహన్‌రెడ్డి బ్యాచ్‌కి మహిళలంటే గౌరవం లేదని మాజీ జడ్పీటీసీ ఎడవల్లి కన్యకాపరమేశ్వరి అన్నారు. సాక్షి టీవీ లైవ్ షోలో కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు అమరావతికి చెందిన మహిళలను వేశ్యలుగా చిత్రీకరించడం క్షమించరాని నేరమన్నారు. ఆది నుంచి వైసీపీలో మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. జగన్, అతని బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు చలకాని వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా తొలగింపు

చింతూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆక్రమిత స్థలాల నుంచి వ్యాపారులు స్వచ్ఛందంగా వెళ్లిపోతున్నారు. చింతూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న స్థలాలను పలువురు వ్యాపారులు ఆక్రమించారు. ఇది రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఏర్పడింది. దీంతో తహశీల్దార్ చిరంజీవి ఆక్రమిత దారులందరికీ నోటీసులు ఇచ్చారు. నిర్ణీత సయమంలో వ్యాపారులు దుకాణాలను తొలగించుకోకపోతే మేమే తొలగిస్తామని తహశీల్దార్ హెచ్చరించారు. ఈనేపథ్యంలో వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణల నుంచి దుకాణాలను తొలగించుకుంటున్నారు.



చింతూరులో ఆక్రమిత స్థలాల నుంచి స్వచ్ఛందంగా ఖాళీ చేస్తున్న వ్యాపారులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

తొండంగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమ్మయ్యపేట వద్ద కారును బస్సు ఢీకొట్టిన ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో రోడ్డుకు అడ్డంగా కారు తిరిగింది. కారులో ఉన్న వారికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆదిత్య యూనివర్శిటీలో పరిశ్రమ అనుసంధానిత శిక్షణ

గండేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆదిత్య యూనివర్శిటీలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక పరిశ్రమ ఆధారిత శిక్షణ ప్రారంభించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొత్తం 805 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వారిలో 781 మంది విజయవంతంగా పూర్తి చేశారన్నారు. వారి పనితీరు ఆధారంగా 75 మంది విద్యార్థులను ఎంపిక చేసి యూనివర్శిటీలో 40 రోజుల ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'నా కుమారుడి రాజకీయ ఎదుగుదల చూడలేకే తప్పుడు ప్రచారం'

ప్రత్తిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నా కుమారుడు ముద్రగడ గిరి రాజకీయ ఎదుగుదల చూడలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ పీఏసీ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభరెడ్డి అన్నారు. తనకు క్యాన్సర్ వచ్చిందని, తన కుమారుడు ఎవరినీ చూడనీయకుండా తనను ఇంటిలో బందీ చేశారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ముద్రగడ కుమార్తె బార్లపూడి క్రాంతి తన తండ్రిపై చేసిన కామెంట్లకు సోమవారం కిర్లంపూడిలోని తన స్వగృహం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ముద్రగడ ప్రజలకు లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె పేరును ఎక్కడ ప్రస్తావించకుండా తన కుమారుడు మనవరాలు, మనవడు రాజకీయ భవిష్యత్‌పై మాట్లాడారు. తన కుమారుడు గిరినే కాకుండా నా మనవరాలు, మనవడిని రాజకీయాల్లోకి తీసుకొచ్చి ముఖ్యమంత్రిస్థాయి వరకు తీసుకెళతానన్నారు. చీఫ్ పబ్లిసిటీ కోసం దిగజారి బతకొద్దంటూ ముద్రగడ అన్నారు

మధ్యాహ్న భోజన పథకం కుక్, హెల్పర్స్‌కు శిక్షణ

కిర్లంపూడి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాలలో పనిచేసే కుక్ కం హెల్పర్స్‌కు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఎంఈవో జోసఫ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ రుచికరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చిన్నారావు, డీఆర్పీలు గుడివాడ రాజ్యలక్ష్మి, సిద్దార్ధ నాగమణి, టి.శ్రీనివాస్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ముళ్ళపూడి ఈశ్వరికి పలువురు అభినందనలు

జగ్గంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జగ్గంపేటకు చెందిన నృత్య కళాకారిణి ముళ్ళపూడి ఈశ్వరిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శాలువాతో సత్కరించి అభినందించారు. తిరుమలలో ఈ నెల 7న నిర్వహించిన నాదనీరాజనంలో కూచిపూడి ప్రదర్శనతో వెంకటేశ్వర స్వామికి ఈశ్వరి నాదనీరాజనం సమర్పించారు. ఆమెతోపాటు టీచర్ ముళ్ళపూడి విజయలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆడప భరత్ బాబు, రేఖ బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే సత్యప్రభ అభినందన

ప్రత్తిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్స్ అందుకున్న ఒమ్మంగి శ్రీ భారతి విద్యానికేతన్ పల్లాటి లాస్య మనస్విని, దుర్గా వైష్ణవిలను సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. కాకినాడలో జిల్లా మంత్రి బి.నారాయణ, కలెక్టర్ షాన్ మోహన్, డీఈవో బి.రమేష్ చేతులమీదుగా అవార్డులు పొందడాన్ని ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుంకర వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.